




# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :165 | బుధవారం 18 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## అక్టోబరు 2 నుంచి 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

### సీఎం చంద్రబాబు



2 లో

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠ పరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## కేటీఆర్ సిగ్గుతో తలదించుకో

### : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్



2 లో

- 650 మంది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: టీపీసీసీ చీఫ్ ఆరోపణ
- ఫోన్ ట్యాపింగ్ కారణంగానే 2018లో కాంగ్రెస్ ఓటమి:
- హార్డ్‌డిస్కల ధ్వంసం వెనుక ప్రభాకర్ రావు, మాజీ సీఎస్ పాత్రపై తీవ్ర ఆరోపణలు
- రాజకీయ లాభాల కోసం ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీపీసీసీ చీఫ్ డిమాండ్

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం టీపీసీచీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందన్నారు.

## బనకచర్లపై ప్రాజెక్టుపై నేడు అఖిలపక్ష సమావేశం



2 లో

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్లమెంటు సభ్యులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలు పంపారు.

ఏపీ ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ వద్దకు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిందని, ప్రాథమిక అధ్యయనంలో, ఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను హరించేలా ఉందని పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకై..

### జూలై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో

#### ఎమ్మెల్సీ కవిత



2 లో

- బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించకపోతే ఎన్నికలు జరగనివ్వం
- తెలంగాణ బీసీల పౌరుషం ఢిల్లీ పాలకులకు చూపిస్తాం
- బీసీ బిల్లులపై కేంద్రంపై ఒత్తిడి చేయాలి
- బీసీ మహిళలపై రాజకీయాల్లో తీవ్ర అన్యాయం - ఉపకోటా అవసరం
- మూడు బీసీ బిల్లులు జాగృతి ఒత్తిడితోనే అసెంబ్లీలో ప్రవేశించాయి
- బీసీ బిల్లుపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మౌనం ఎందుకు?: ఎమ్మెల్సీ కవిత ప్రశ్న
- కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ బీసీలపై కుట్రలు చేస్తున్నాయ్: కవిత ఆరోపణ

## గోశాలల సంరక్షణ నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



2 లో

- నాలుగు కొత్త గోశాలలకు రూపకల్పన
- గోవుల సంరక్షణే ధ్యేయం: వేములవాడ, యాదగిరిగుట్టలో ఆధునిక గోశాలలు నిర్మాణం
- కోడె మొక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- గోశాలల నిర్వహణపై సమగ్ర అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు
- గోవుల సంరక్షణపై ప్రభుత్వం వెనుకాడదు: నూతన విధానానికి సీఎం ఆమోదం

## కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే.. రేవంత్ ఓట్లకు ఓట్లకు మధ్య ఇస్తున్నారు

- ఓట్ల కోసం రైతు భరోసా నాటకం
- కేసీఆర్ నాట్లకు ఇచ్చిన రైతుబంధు - రేవంత్ ఓట్లకు ఇచ్చిన భరోసా!
- ధాన్యం కొనుగోళ్ల పేరుతో రూ.1500 కోట్లు దోపిడీ

- పెద్ది సుదర్శన్ రెడ్డి



న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు తప్పనిసరి అయిన పరిస్థితుల్లో ఓట్ల కోసం రైతు భరోసా పేరిట నాటకానికి తెరతీశారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి బజారు రౌడీ కన్నా హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు భరోసా స్థానిక సంస్థల స్టంట్ మాత్రమేనని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎలా వచ్చేదో.. ఇప్పుడు ఎలా వస్తుందో.. రైతులు ఆలోచించుకోవాలని సూచించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయం

- కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్న బీఆర్ఎస్ నేతలు
- కాంగ్రెస్ పాలనలో 2 వేల మెగావాట్ల అదనపు డిమాండ్ వచ్చినా ఒక్క నిమిషం విద్యుత్ అంతరాయం లేదు
- రైతులకు రూ. 13,600 కోట్లు రైతు భరోసా కింద జమ: ఏ రాష్ట్రంలోనూ లేని చరిత్ర!
- ఇందిరమ్మ పాలనలో ఏడాదికి రూ.70 వేల కోట్లు సంక్షేమానికిబీ భూమిలేని రైతులకు రూ.12 వేల ఆర్థిక భరోసా
- 16 నెలల్లో 56 వేల ఉద్యోగాలు- యువత కోసం రూ. 8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభం



న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి భారీ అవినీతికి పాల్పడి రాష్ట్ర సొమ్మును ప్రాజెక్టు పేరుతో దోపిడీ చేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం జయశంకర్ జిల్లా కొత్తపల్లి ఘోరి మండలం చెన్నాపూర్ లో ముందుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ డా కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ 33/11 కెవి సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం భూపాలపల్లి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలో రూ.8.70 కోట్ల విలువైన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం 2 వేల మెగావాట్ల విద్యుత్ అదనపు డిమాండ్ వచ్చినా రాష్ట్రంలో ఒక్క నిమిషం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఉచిత విద్యుత్ పథకాల కోసం రాష్ట్ర ప్రజల పక్షాన ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.13,992 కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు.

కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన బిఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా కాళేశ్వరం బ్రహ్మాండమని చెప్పుంటే జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కుంగిపోతున్న విషయాన్ని ఫోటోలతో బయటపెట్టింది జర్నలిస్టులేనని, కాళేశ్వరం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందని ఎన్ డి ఎస్ ఏ నివేదిక ఇచ్చిందని, చూపెట్టిన డిజైన్ కు కట్టిన దానికి పొంతన లేదన్న విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ఎస్ .ఆర్ .ఎస్. పి. అంగుళమైనా కూలిందా , శ్రీపాద ఎల్లంపల్లి కి ఏమైనా ఇబ్బంది వచ్చిందా? నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయిని ఆయన వివరించారు. ఇంజనీర్ల పని వారిని చేనియకుండా బిఆర్ఎస్ నేతలు డిజైన్ చేయడం, పనుల్లో పూర్తిగా జోక్యం చేసుకోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు.

2 లో

## టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..



2 లో

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై మహేష్ గౌడ్ ఆరోపణలు చేయడంతో ఈ నోటీసులు పంపినట్లు తెలుస్తుంది. తనపై ఫోన్ ట్యాపింగ్ కేసులో అసత్య ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కార్, తమ చేతకాని తనాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చి రాద్ధాంతం చేస్తున్నారు అని మండిపడ్డారు.



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాకు కాస్త సమయం ఇవ్వాలి:

### కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ రియాక్షన్..

- బీజేపీ ఐక్యత కోసం పని చేస్తున్నా, పదవుల కోసం కాదు
- తనను లక్ష్యంగా చేసుకోవడమేంటి - పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తున్నా
- వ్యక్తిగత విభేదాలు విడిచిపెట్టి కలిసి పనిచేద్దాం
- బీజేపీ 119 నియోజకవర్గాల్లో గెలవాలంటే ఐక్యత అవసరం : ఎమ్మెల్యే రాజాసింగ్

2 లో

## గత ప్రభుత్వమే ఏపీకి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంది

### : మంత్రి శ్రీధర్ బాబు



2 లో

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి నీటి వివాదానికి కారణం గత పాలకుల నిర్వాకమనేని ధ్వజమెత్తారు. గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు లాభం చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుందని ఆరోపించారు. ప్రస్తుత తాము గోదావరి జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడడంలో ఎక్కడి వరకైనా వెళ్ళి పోరాడేందుకు సిద్ధమని పేర్కొన్నారు.

## ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దు..

### జీ7 దేశాల ప్రకటన




2 లో

న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్): ఇజ్రాయెల్ ఇరాన్ వివాదంపై జీ7 దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని, ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చాయి. ఇరాన్ అణు బాంబును కలిగి ఉండటానికి అనుమతించలేమని స్పష్టం చేశాయి.

# ఆ విషయంలో ఎక్కడికైనా, ఎప్పుడైనా రావడానికి సిద్ధం!

**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే రాజా సింగ్ “సీనియర్ నాయకుడు” అని, తనను “సామాన్య కార్యకర్తను” అని పేర్కొనడమే కాకుండా, రాజా సింగ్ చెప్పినట్లు తాము పాటిస్తామని రాష్ట్ర కమలం పార్టీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతుంది. దీంతో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభేదాలను విడిచి పెట్టి, ఐక్యంగా లక్ష్య సాధన కోసం పని చేద్దామని కోరారు. మీరు ఎప్పుడు కలిస్తానని చెప్పిన అప్పుడు వచ్చి కలుస్తానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలనేది నా ఉద్దేశ్యం.. వ్యక్తిగత లబ్ధి, పదవుల కోసం తాను ఎప్పుడూ పని చేయలేదని రాజాసింగ్ వెల్లడించారు.

అయితే, పార్టీని బలోపేతం చేయడం కోసం అంకితభావంతో పని చేశాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించడంపై దృష్టి పెట్టడానికి బదులుగా, పార్టీకి నిస్వార్థ సేవ చేసినప్పటికీ, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం?.. ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డాను.. ఈ రోజు కూడా నా కోసం కాకుండా, పార్టీ ఐక్యత కోసమే పని చేస్తున్నాను, లక్షలాది మంది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడుతున్నాను అని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను.. కొంచెం సమయం కేటాయించండి.. వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు. కిషన్ రెడ్డి ఎక్కడికి, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాను పార్టీని విభజించడానికి కాదు- ఐక్యంగా ఉండటానికి ఇక్కడ ఉన్నాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.

## అక్టోబరు 2 నుంచి 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం: సీఎం చంద్రబాబు



**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠ పరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తొలిదశలో రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయటంతో పాటు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఈ ఏడాది అక్టోబర్ 2 కల్లా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరంతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని సీఎం స్పష్టం చేశారు. 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సెంటర్ల ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచే వారికి ‘స్వచ్ఛత’ అవార్డులు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ‘సర్క్యులర్ ఎకానమీ’పై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. ‘సర్క్యులర్ ఎకానమీ పార్కులు’ ఏర్పాటుపై ‘మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా’ ప్రతిపాదనలను పరిశీలించారు.

## కేటీఆర్ సిగ్గుతో తలదించుకో: మహేష్ కుమార్..

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సీఎం, కేటీఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని వ్యాఖ్యలు చేశారు.


ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా ఉండలనే చెడు ఆలోచనతో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మూమెంట్స్ అన్నీ కూడా ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబెట్టి తమ ఫోన్‌లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు టాప్ జరిగాయన్నారు. ఈనాడు కేటీఆర్ తాము నీతివంతులం, నిజాయితీపరులమని అంటున్నారని.. ఆయన సిగ్గుతో తలవంచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య అని అన్నారు.

తమ ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని ఆరోపించారు. నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి వినతి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమమన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లలతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్క్‌లను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దు..

### జీ7 దేశాల ప్రకటన

మొదటి పేజీ తరువాయి




ఈ మేరకు కూటమిలోని దేశాలు కెనడా లోని కననాస్కిస్‌లో జరుగుతున్న సమ్మిట్‌లో భాగంగా సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. ‘పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి జీ7 కట్టుబడి ఉంది. తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. ఇజ్రాయెల్ భద్రతకు మద్దతు తెలుపుతున్నాం. ప్రాంతీయ అస్థిరతకు ఇరాన్ ప్రధాన కారణం. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండొద్దు. దానిని ఎప్పటికీ అనుమతించబోము’ అని తెలిపాయి. పశ్చిమాసియాలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆశిస్తున్నట్టు వెల్లడించాయి.

ఉక్రెయిన్ కు సైనిక సాయం

జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఉక్రెయిన్‌కు 2 బిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని ప్రకటించారు. ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి అధునాతన డ్రోన్‌లు, హెలికాప్టర్లు, ఇతర సైనిక పరికరాలు ఈ ప్యాకేజీలో ఉన్నాయి. ఉక్రెయిన్ కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్టు కార్నీ వెల్లడించారు. వివాదాన్ని ముగించడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నాలలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లకై.. జూలై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో :

### ఎమ్మెల్సీ కవిత

**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** బీసీ రిజర్వేషన్లకై జూలై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకోలో పాల్గొంటామని ఆమె పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషం ఏంటో చూపిస్తాం. ఢిల్లీ పాలనకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించనివ్వబోం. 42 రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తుంది. బీసీ విద్యార్థులు, మహిళలు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున కలిసిరావాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తోంది అని కవిత ప్రకటించారు.

తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితోనూ అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టింది. వార్డు మెంబర్, సర్పంచ్‌లు కాని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయి. అసెంబ్లీ గడప తొక్కని అనేక కులాలు ఉన్నాయి. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోటా ఉండాలి. ఇది రాజకీయ వేదిక కాదు%౯% ఇది మానవ హక్కులు, సామాజిక హక్కులు వేదిక. సమాజంలో 56 శాతం జనాభాకు సంబంధించి హక్కులు కోరుతుంటే అవి మానవ హక్కులు కావా..? ఇప్పుడు మాట్లాడాల్సిన సందర్భం వచ్చింది.. కాబట్టి అందరూ కలిసికట్టుగా హక్కల కోసం పోరాటం చేయాలి. సరైన సమయంలో జాగృతి మాట్లాడింది కాబట్టి అసెంబ్లీలో మూడు బిల్లులు వచ్చాయి. అదే స్పూర్తితో బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.

ఢిల్లీకి బిల్లు పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదు..? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రతీ ఒక్కరు రఘునందన్ రావును ప్రశ్నించాలి. కులగణన వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించాలి. రౌండ్ టేబుల్ సమావేశానికి రానివ్వకుండా బీసీ నాయకులను మెదక్‌లో కొంత మంది బెదిరించే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టే వాళ్లు భయపడుతున్నారని అర్థమవుతోంది అని ఎమ్మెల్సీ కవిత అన్నారు

## కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే.. రేవంత్ ఓట్లకు ఓట్లకు మధ్య ఇస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

### : పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతుందని పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలని కోరారు. ఎకరాకు రూ.25 వేల బకాయిలు ఇచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేతలను రానివ్వద్దని సూచించారు. కేసీఆర్ నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చే వారని.. రేవంత్ రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇస్తున్నారని విమర్శించారు. సర్పంచుల పాత బిల్లులకు తమకు సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి విడ్డూరంగా మాట్లాడారని అన్నారు. అలా అయితే కేసీఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తీసుకొచ్చిన తెలంగాణతో, ఆయన కట్టిన సచివాలయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పాలకుడు కాదని అన్నారు.

ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పేది శుద్ధ తప్పు అని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. పంటల కొనుగోళ్లు విషయంలో రైతులు ఈసారి పడిన ఇబ్బందులు ఎప్పుడూ లేదని తెలిపారు. పంటల కొనుగోళ్ల పేరిట కాంగ్రెస్ కార్యకర్తలు రైతుల నుంచి దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ పేరిట రూ.1500 కోట్ల దోపిడీకి కాంగ్రెస్ పాల్పడిందని ఆరోపించారు. అణువణువునా కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ పంట కాలంలో రైతులకు ఒక్క క్వింటాలుకు కూడా బోనస్ ఇవ్వకుండా బోగస్ చేశారని అన్నారు. ధ్యానం టెండర్ల కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కడుపు నిండా తినడంతో పాటు దిల్లీకి కూడా పంపారని అన్నారు. హైకోర్టులో పిల్ దాఖలు చేస్తే%౯% ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా తప్పించుకుంటోందని మండిపడ్డారు. తప్పు చేయకపోతే ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా 16 వాయిదాలు ఎందుకు తీసుకొందని ప్రశ్నించారు. రైతుల ఉసురు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తగలక తప్పదని అన్నారు.

# గోశాలల సంరక్షణ నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో గోవుల సంరక్షణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 17న సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన చేయాలని అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని.. స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో మొదట గోశాలలు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఇక, భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల నిర్మాణం ఉండాలని తెలిపారు. అలాగే, గోవుల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. కాగా, వివిధ రాష్ట్రాల్లోని గోశాల విధానాలను అధ్యయనం చేయడానికి పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఎండోమెంట్స్ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావులతో కూడిన ముగ్గురు అధికారులతో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అయితే, టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ పేర్కొన్నారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం దారుణమైన చర్య.. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి అని విమర్శించారు. రాజకీయాల్లో బీఆర్ఎస్ నేతలే ఉండాలనే దురుద్దేశంతో ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని చెప్పుకొచ్చారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ ట్యాపింగే కారణమని ఆరోపించారు. ఈరోజు వాస్తవాలు బయటకు వచ్చాయి.. చట్టానికి వ్యతిరేకంగా అనేక మంది ఫోన్లను ట్యాప్ చేశారని మహేష్ గౌడ్ తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మయం

మొదటి పేజీ తరువాయి

### : ఉప ముఖ్యమంత్రి


కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అని ఎన్నికల ముందు బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారని, 2025 మార్చిలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడింది.. బిఆర్ఎస్ నేతల పాలన కాలం 2023 మార్చి తో పోలిస్తే ఈ సంవత్సరం 2 వేల మెగావాట్లు డిమాండ్ అధికంగా వచ్చింది ఐనా ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రాష్ట్ర ప్రజలకు సేవ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వామ్యాన్ని స్పష్టం చేశారు. ఈ విజయం సాధించిన లైన్మెన్ నుంచి సిఎండి వరకు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు రూ. 16 వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించిందని, రాష్ట్రంలో 50 వేల కుటుంబాలకు 200 యూనిట్ల, ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం మొత్తంగా ఉచిత విద్యుత్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రతి సంవత్సరం రూ. 13,992 కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ

ఈ రాష్ట్రంలో సంక్షేమాన్ని వెనుకబడనివ్వం అభివృద్ధిని ఆగనివ్వమని ఆయన ఖరాఖండిగా తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్కరు ఇల్లు, ఆదాయం లేకుండా ఇబ్బంది పడొద్దు అనేదే ప్రజా ప్రభుత్వం ఆలోచన అని,గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు ప్రతి రూపాయిని దోచుకున్నారు, కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు, జీవన ప్రమాణాలు పెరగలేదు అందుకే రాష్ట్ర ప్రజలు 2023లో పరిస్థితిని అర్థం చేసుకొని కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ప్రజల పక్షాన కాదు పాలకుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ నేతలు కోరుకుంటున్నారని, కానీ మేము ప్రతిరోజు 18 గంటల పాటు ప్రజల కోసమే పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ. 13,600 కోట్లు జమ చేశాం, సోమవారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ నుంచి రైతాంగానికి రూ. 1.49 కోట్లు 39 వేల ఎకరాల రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమచేశామని తెలిపారు. మొత్తం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేసిన చరిత్ర ఈ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.70 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఐదు సంవత్సరాల కాలంలో రూ. 3.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నామని ధైర్యంగా చెప్పడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. కేవలం భూమి ఉన్న రైతులకే కాదు భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12 వేలు జమ చేస్తున్నామని, రాష్ట్రంలో కోటి కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ పెద్ద ఎత్తున జరుగుతుందని, సన్న బియ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.13,525 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 10 సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ నేతలు పేదలకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున మొదటి దశలో నాలుగున్నర లక్షల ఇల్లు రూ.22,500 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, మరో 30 వేలు ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ ప్రాసెస్ లో ఉన్నాయని, ఉద్యోగాలు రాని యువత కోసం రూ. ఎనిమిది వేల కోట్లతో ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం తీసుకు వచ్చామని అన్నారు. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ నేతలు డ్వాక్రా సంఘ సభ్యుల గురించి మర్చిపోయారని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మొదటి సంవత్సరం రూ. 21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామని, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘ సభ్యులకు ఇస్తామని అన్నారు. పేదలకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ఎవరి అంచనాలకు అందని రీతిలో మొదటి దశలో 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రూ. 11,500 కోట్లు మంజూరు చేసామన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం 40% డైట్ చార్జీలు 200% కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. సంక్షేమం, వ్యవసాయం, ఉపాధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దావోస్ లో 1.80 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకొని వచ్చారని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాల్లో ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ రాష్ట్రం పోటీ పడుతుందని తెలిపారు.

## బనకచర్లపై ప్రాజెక్టుపై నేడు అఖిలపక్ష సమావేశం



**న్యూస్ డెస్క్ ,17 జూన్ (కెరటం న్యూస్):** బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్లమెంటు సభ్యులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలు పంపారు.

ఏపీ ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ వద్దకు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిందని, ప్రాథమిక అధ్యయనంలో, ఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను హరించేలా ఉందని పేర్కొన్నారు.

దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది జనవరి 22న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర జలశక్తి శాఖ తమకు ఏపీ నుంచి ఎలాంటి డీపీఆర్ అందలేదని పేర్కొందన్నారు. ఇదే అంశంపై తాను సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కలిశామని తెలిపారు.

ఆ తర్వాత కూడా పలుమార్లు లేఖలు రాసినట్టు తెలిపారు. ఏపీ జలశక్తి శాఖకు ప్రతిపాదనలు పంపినందున దీనిని అడ్డుకొనేందుకు ఎలా ముందుకెళ్లాలనే విషయం చర్చించేందుకు రావాలని అన్ని పార్టీలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ని కూడా ఆహ్వానించామని వివరించారు.

## జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ తనదైన ప్రత్యేకతను చాటారు

### తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం టౌన్,17 జూన్ (కెరటం న్యూస్):** జిల్లా కలెక్టర్ గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వర్తించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్ ఖాన్ ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డి మంగళవారం కలిసి ఆయన సేవలను కొనియాడుతూ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.... జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి బదిలీ అయ్యేంత వరకు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో నూతన నవోదయ విద్యాలయం ఏర్పాటు

### మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్/ఖమ్మం బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రానికి ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరవడం బీఆర్ఎస్ పార్టీ సాగించిన నిరంతర కృషికి ఫలితమని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మీడియాకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఈ విద్యాసంస్థలు స్థాపించబోతున్నాయని, ఈ ఏడాది జూలై 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారన్నారు. వీటితో రాష్ట్రంలో జవహర్ నవోదయ విద్యాలయాల మొత్తం సంఖ్య 16కి చేరిందని తెలిపారు. తెలంగాణ నూతన జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా కొత్త నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ తరపున గట్టిగా డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నామ గుర్తు చేశారు. ప్రత్యేకించి భద్రాద్రి కొత్తగూడెం వంటి వెనుకబడిన జిల్లాల్లో ఈ పాఠశాలలు ఏర్పాటు కావాలని పార్లమెంటు వేదికగా మాట్లాడటమే కాకుండా, పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ విషయంలో కేంద్రానికి లేఖలు రాసినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి 21 నవోదయలు అవసరమన్నా, కేవలం 7 మాత్రమే మంజూరు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నవోదయ విద్యాలయాలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించేందుకు దోహద పడతాయన్నారు. గ్రామీణ యువతకు సువర్ణ అవకాశం లాంటి ఈ పాఠశాలలు వారికి నాణ్యమైన విద్యతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధత కల్పిస్తాయని నామ అన్నారు. ఈ విద్యా సంస్థలు కేవలం విద్యను అందించడంలోనే కాదు, గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నవోదయ విద్యాలయం ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు మెరుగైన భవిష్యత్తు దిశగా దారి వేసేలా అవుతుందని, వారి ప్రతిభను దేశస్థాయిలో వెలుగులోకి తీసుకొచ్చేలా చేస్తుందని నామ అభిప్రాయపడ్డారు. ఈ విద్యాలయాలు, నాణ్యమైన ఉచిత విద్యతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధత కల్పిస్తూ, వెనుకబడిన వర్గాలకు ఇది ఒక సువర్ణావకాశంగా నిలుస్తుందని నామ పేర్కొన్నారు.

## కేటీఆర్ కు ఎంపీ వద్దిరాజు సంఘీభావం



**హైదరాబాద్ బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు బయలుదేరిన సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆయన్ను కలిసి తన సంఘీభావం తెలిపారు.ఫార్ములా ఈ- కార్ రేసింగ్ నిర్వహణ, ఒప్పందంలో అవినీతి చోటు చేసుకుందన్న నిందారోపణలతో మాజీ మంత్రి కే.టీ.రామారావుపై ఏసీబీ కేసు బనాయించి నోటీసులు పంపడం తెలిసిందే.ఈ సందర్భంగా సోమవారం ఉదయం విచారణకు హాజరయ్యేందుకు గాను ఏసీబీ డైరెక్టర్ కార్యాలయానికి కేటీఆర్ బయలు దేరడానికి ముందు నందినగర్ లోని నివాసంలో ఎంపీ రవిచంద్ర ఆయన్ను కలిసి తన సంఘీభావం ప్రకటించారు. ఆ తర్వాత తెలంగాణ భవన్ లో కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతున్న సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుతో కలిసి ఎంపీ వద్దిరాజు పాల్గొన్నారు.

## మనుమరాలు సహస్రికకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**హైదరాబాద్ బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మనుమరాలు సహస్రిక పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి కుటుంబ సభ్యుల ఆశీస్సుల మధ్య ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ మినిస్ట్రీ ఆఫ్ కిడ్స్ లో జరిగిన ఈ వేడుకల్లో సహస్రిక చేత తాత-నాయనమ్మ,వద్దిరాజు రవిచంద్ర -విజయలక్ష్మీ,తల్లిదండ్రులు నిఖిల్ చంద్ర -అనీల, అమ్మమ్మలు రేవతిపద్మ, శీలం లక్ష్మీలు కేక్ కట్ చేయించి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ వేడుకలకు సహస్రిక మేనత్త డాక్టర్ గంగుల గంగాభవాని,మేనత్త-మామయ్య బోరిగం మాధవి- విజయ్, బాబాయి-పిన్ని వద్దిరాజు నాగరాజు- డాక్టర్ అర్చిత, పిన్ని-బాబాయ్ గాయత్రి-రామ్, మేనమామ వరుణ్, బాబాయ్ లు వద్దిరాజు శివ ప్రీతమ్, వద్దిరాజు గిరినందన్, గాయత్రి గ్రానైట్స్ కంపెనీ ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరై అక్షింతలు వేసి తమ ఆశీస్సులు అందజేశారు.



## మా ఇంట శుభ కార్యానికి రండి

### ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం



**హైదరాబాద్ బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** తన మనవడు, మనుమరాలు నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు రావలసిందిగా కోరుతూ కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి కొట్టి వెంకటేశ్వర రావు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఆహ్వానించారు. కొట్టి నవీన్ -దేవీ దంపతుల కుమారుడు ప్రద్యున్,ప్రజక్త నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుక ఈనెల 22వతేదీ ఆదివారం ఉదయం 11గంటలకు కొత్తగూడెంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఏస్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో జరుగుతుంది.ఈ వేడుకకు హాజరు కావలసిందిగా కోరుతూ వెంకటేశ్వర రావు మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్,ప్రముఖ న్యాయవాది అనుదీప్ లు ఉన్నారు.

## రైతు భరోసా వానాకాలం-2025 రైతుల ఖాతాల్లో జమ

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ఖమ్మం బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** రైతు భరోసా వానాకాలం 2025 లో భాగంగా రైతుల ఖాతాల్లో సోమవారం నుండి నేరుగా జమచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 53 వేల 794 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 436 కోట్ల 84 లక్షల 65 వేల 365 రూపాయలు జమచేయనున్నట్లు వ్యవసాయ అధికారి అన్నారు. సోమవారం మొదటి రోజున 2 లక్షల 13 వేల 932 మంది రైతులకు 123 కోట్ల 38 లక్షల 40 వేల 175 రూపాయలు, రెండో రోజు మంగళవారం 3 ఎకరాల వరకు భూమి గల 46 వేల 859 మంది రైతులకు మొత్తం 70 కోట్ల 6 లక్షల 57 వేల 468 రూపాయలను, ఇప్పటివరకు 2 లక్షల 60 వేల 791 మంది రైతులకు 193 కోట్ల 44 లక్షల 97 వేల 643 రూపాయలను రైతు భరోసా వానాకాలం-2025 క్రింద రైతుల ఖాతాల్లో జమచేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. 5 జూన్, 2025 నాటికి పట్టాదారు పాస్ పుస్తకం పొందిన, డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) ఫెయిల్ అయిన రైతు సోదరులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, ఖాతా నెంబర్ ను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## శభాష్ జ్యోతి

### మీ అంగన్వాడి సేవలు చిరస్మరణీయం

### అంగన్వాడి సేవల పుస్తక ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం,17 జూన్ (కెరటం న్యూస్):** దట్టమైన అడవి ప్రాంతంలో నివసిస్తున్న చత్తీస్గడ్ వలస గొత్తి కోయల పిల్లల కోసం నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం భద్రాద్రి జిల్లాకి ఆదర్శంగా నిలపడం ఎంతో ఆనందంగా ఉందని, అందుకు నిబద్ధతతో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు జ్యోతి సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాద్రి జిల్లా పాత పాల్వంచలోని హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట ముగింపు ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఉపాధ్యాయుల పనితీరు ఎంతో నమ్మకమైనదని చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. గట్టు మల్ల ప్రాంతంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని చిన్నారుల ఆలనా పాలన చూస్తూ అంగన్వాడి కేంద్రాల నిర్వహణపై నమ్మకం కలిగిస్తున్న ఉపాధ్యాయురాలు బానోతు జ్యోతి చేస్తున్న కృషి కి నిదర్శనంగా తాను నిర్వహిస్తున్న పనుల పట్ల ఒక పుస్తక రూపంలో దాల్చి ప్రతి ఉపాధ్యాయురాలకు ఆదర్శంగా నిలవడం స్ఫూర్తిదాయకం అన్నారు. రానున్న రోజుల్లో గట్టుమల్ల ప్రాంతంలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం భద్రాద్రి జిల్లాకి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ స్వర్ణలత లెనిన, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న సూపర్వైజర్లు అంగనవాడి ఉపాధ్యాయురాళ్ళు డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## సాఫీగా జరుగుతున్న 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ

### జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్

**3 లక్షల 3 వేల 596 మంది రేషన్ కార్డులకు అందిన మూడు నెలల రేషన్**

**జూన్ 30 వరకు రేషన్ షాపులలో రేషన్ బియ్యం పంపిణీ**

**ఖమ్మంలో రేషన్ షాపులను తనిఖీ చేసిన డిసిఎస్ఓ**



**ఖమ్మం బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ పంపిణీ ప్రక్రియ సాఫీగా జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, ఖమ్మం అర్బన్ మండలంలోని శ్రీనివాస్ నగర్, ప్రకాష్ నగర్ లో రేషన్ షాపులను డిప్యూటీ తహసిల్దార్ తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెలలో 3 నెలల రేషన్ ను రేషన్ కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామని, దీని కోసం మన జిల్లాకు 21 వేల 915 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం స్టాక్ వచ్చిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 4 లక్షల 15 వేల 904 రేషన్ కార్డులకు ఇప్పటి వరకు 3 లక్షల 3 వేల 596 రేషన్ కార్డులకు రేషన్ షాప్ ల నుంచి మూడు నెలల రేషన్ అందిందని అన్నారు. రేషన్ బియ్యం సరఫరా అంశంలో అప్రమత్తంగా ఉండాలని, అక్రమ బియ్యం రవాణా జరగకుండా ఉండేందుకు అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో, ఆర్డిఓ ల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు చేపట్టిన తనిఖీలలో భాగంగా ఖమ్మం అర్బన్, పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, తల్లాడ మండలాల్లో ఇప్పటి వరకు 5 అక్రమ బియ్యం రవాణాదారులపై 6ఏ కేసులు నమోదు చేసి 7 లక్షల 29 వేల రూపాయల విలువ గల 213 క్వింటాళ్ల సన్న బియ్యంతో పాటు 12 లక్షల 50 వేల రూపాయల విలువ గల 3 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. రేషన్ డీలర్లు రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యం సక్రమంగా అందించాలని, జూన్ 30 వరకు అన్ని రేషన్ షాపులు తెరిచి ఉంచి బియ్యం పంపిణీ చేయాలని, రేషన్ కార్డుదారులు తప్పని సరిగా తమ రేషన్ తీసుకుని వెళ్లి సన్నబియ్యం పథకం సద్వినియోగం చేసుకోవాలని, సన్న బియ్యం బయట అమ్మితే రేషన్ కార్డు రద్దు చేయడం జరుగుతుందని, అలాగే కొన్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు.

# వందేళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి

**గ్రామీణ ప్రజల సమస్యలపై స్పందించేది సిపిఐనే**

**గ్రామ శాఖల మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**లక్ష్మీదేవిపల్లి/కొత్తగూడెం,17 జూన్ (కెరటం న్యూస్):** వందేళ్ల సుదీర్ఘ పోరాటాల స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కోరారు. మండలంలోని ఉమ్మడి సీతారాంపురం, వేపలగడ్డ, లాలుతాడా పంచాయతీల పరిధిలోని 14 గ్రామాల మహాసభ సోమవారం రాత్రి జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి ఏజెన్సీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కరంకోసం కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తోందని, ప్రజలకు సేవలందిస్తున్న ఫలితంగానే గ్రామాల్లో సిపిఐని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. పోడు భూములకు పట్టాలు, సంక్షేమ పథకాల అమలుకోసం సిపిఐ నిరంతరం కృషిచేస్తుందని తెలిపారు. పూర్తిస్థాయిలో రైతులకు రైతు భరోసా అందించాలని, వరికి రావాల్సిన బోనస్ క్వింటాకు రూ.5వేలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, నాయకులు ఎస్ కె ఫహీమ్, నేరెళ్ల రమేష్, నూనావత్ గోవిందు, దారావత్ శ్రీను, బానోత్ నెహ్రు, సాపావట్ రవి, జర్పుల ఉపేందర్, నూనావత్ చింటూ, బోడ రాములు, గుగులోత్ శ్రీను, సంపత్, బానోత్ పరుశరాం, శాపావత్ వినోద్, భీమా, నర్సింహా, భిక్కులాల్, బానోత్ రమేష్, మోహన్, బానోత్ బుర్రో, సురేష్, మంగీలాల్, ఆదినారాయణ, యాకూబ్, ముత్తయ్య, బాలకృష్ణ, శంకర్, హరి, చిన్న, జగన్ మోహన్ దాస్, నూనావత్ రమేష్, లకావత్ కిషన్, శరత్ చంద్, బాలు, బోధ రాము, కిషన్, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం ,17 జూన్ (కెరటం న్యూస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రమాదాలకు గురైన ప్రాంతాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలసి ఆయన మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా రహదారుల, గుంతలు పూర్తిగా పూడ్చాల్సిందిగా సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రమాదాల సమయంలో తక్షణ చికిత్స కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సిందిగా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ శాఖలు సంఘటితంగా పని చేసి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. సమీప ఆసుపత్రులు, రహదారులను గుర్తించి ప్రాణాపాయం మినహాయించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్‌లు, ట్రామా కేర్ కేంద్రాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రామవరం ట్రామా కేర్ కేంద్రం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో సిపిఆర్ మానిక్యూర్ కిట్లు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి సిపిఆర్ శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రయాణదారుల భద్రతకు సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు, జీబ్రా లైన్లు, స్టాప్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి చెట్లు తొలగించాలని, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని పెద్ద బజార్, చిన్న బజార్ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రహదారి భద్రతపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈఈ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం నేల పవిత్రమైంది

**ఖమ్మం జిల్లా ప్రగతి కొనసాగించాలి -ముజమ్మిల్ ఖాన్**

**ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పటిష్ట చర్యలు**

**ప్రజలకు మన సంతోషాన్ని పంచాలి, వారిపై మన అసంతృప్తి ప్రదర్శించొద్దు**

**బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహణ**



**ఖమ్మం బ్యూరో,17 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి, సంక్షేమ అంశాలలో ఖమ్మం జిల్లా కొనసాగిస్తున్న విజయగాధను కొనసాగించాలని బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్రంలో నిర్వహించిన ఐఎఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ సంచాలకులుగా బదిలీపై వెళ్తున కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా అధికారుల బృందం నిర్వహించారు. కలెక్టరేట్ కు చేరుకున్న ముజమ్మిల్ ఖాన్ కు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్.సి.సి. కెడేట్స్, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రగతిని ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నారని, స్నేహపూర్వక వాతావరణంలో అధికారులంతా మంచి బృందంగా ఏర్పడి ప్రజా సమస్యలు పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేసేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి, రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, పలువురు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో తమకు ఉన్న అనుభవాలను తెలియజేశారు.

## అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి

ఈ సందర్భంగా బదిలీ పై పౌరసరఫరాల శాఖ సంచాలకులుగా వెళ్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ గా తన ప్రస్థానాన్ని ముజమ్మిల్ ఖాన్ వివరించారు. ఖమ్మం నేల చాలా పవిత్రమైందని, ఇక్కడ పని చేయడంలో చాలా సంతృప్తి లభిస్తుందని, వరదల సమయంలో ఇక్కడి అధికారులు, సిబ్బంది అద్భుతంగా పని చేశారని అన్నారు. ప్రజలకు నేరుగా క్షేత్రస్థాయిలో ఇంటారాక్ట్ అవుతూ వారి సమస్యలు పరిష్కరించేందుకు తనకు అవకాశం లభించిన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. హుస్నాబాద్ లో సబ్ కలెక్టర్ గా మొదటిసారి విధులకు చేరిన కొత్తలో ఒక ముసలావిడ తన దగ్గర వచ్చి దరఖాస్తు ఇచ్చి సమస్య పరిష్కారం చేయాలని కోరిందని, తాను ఇటీవలే చేరానని తన పరిధిలో రాదని చెప్పినా కలెక్టర్ కాబట్టి పరిష్కరించాలని ఆ ముసలమ్మ అడిగినప్పుడు ప్రజలకు వ్యవస్థ పట్ల ఉన్న నమ్మకం మొదటిసారి గమనించానని అన్నారు.



కలెక్టరేట్ వ్యవస్థ 250 సంవత్సరాల నుండి ఉందని, మనకు వ్యక్తిగతంగా ఎటువంటి గౌరవం, గుర్తింపు ఉండదని, వ్యవస్థకు ఆ గౌరవం లభిస్తుందని అన్నారు. మనం ఉన్నా లేకపోయినా వ్యవస్థ ప్రజల కోసం పని చేయాలని, వ్యక్తిగత కాంట్రిబ్యూషన్ ఒక్కటి రెండు శాతాలు మాత్రమే ఉంటాయని అన్నారు.



మనం న్యాయం ప్రకారం విధులు నిర్వహిస్తే ప్రజల ముఖాలపై కనిపించే సంతోషం నుండి వచ్చే సంతృప్తి ఎక్కడా లభించిందని అన్నారు. శాంతి భద్రతలు సరిగా ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. వరదల సమయంలో కార్యాలయానికి పరిమితం కాకుండా పోలీస్ కమిషనర్ నేరుగా ప్రజలలో వెళ్లి పని చేశారని కలెక్టర్ తెలిపారు. గత సంవత్సరం భారీ వరదల నేపథ్యంలో వరద సహాయక చర్యలు, సాధారణ పరిస్థితులను పునరావృతం చేయడం వంటి అంశాలలో ఉద్యోగులు సఫలీ కృతులయ్యారని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను విజయవంతంగా సకాలంలో పూర్తి చేయడం కారణంగా వరదల విపత్తుల నుంచి బయటపడ్డామని, భవిష్యత్తులో వరదలు వస్తే ఎలా ఎదుర్కోవాలో పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నామని అన్నారు.



మహిళలు అన్ని ప్రాంతాలు, మతాలు, కులాల వారిగా గత కొన్ని దశాబ్దాలుగా వివక్షకు గురయ్యారని, దానిని నివారించేందుకు మహిళలను బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 50 శాతం జనాభాను విస్మరిస్తే అభివృద్ధి సాధ్యం కాదని, తన సొంత కుటుంబంలో కూడా మూడవా తరం అద్భుత స్థితిలో ఉందంటే కారణం ఒక మహిళ చదువుకోవడం మాత్రమేనని అన్నారు. దేశం చాలా మారిందని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు బాధ్యత, పారదర్శకత పెరిగిందని, ప్రజలు నిరంతరం గమనిస్తూ మన పని తీరు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. మనం ఆశించే మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. బాల సదనంలో పిల్లలను మన పిల్లలుగా భావించాలని అన్నారు. అసమానతలను తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. నవ సమాజ నిర్మాణానికి పునాది సంక్షేమ శాఖ ద్వారా వేసే అవకాశం ఉంటుందని, బాల సదనం, అంగన్ వాడి కేంద్రాలకు చేసే పని చాలా సంతృప్తి కలిగించిందని అన్నారు.

మహిళా మార్ట్, స్త్రీ టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ, వరద సహాయక చర్యలు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన ఇలాంటి అనేక కార్యక్రమాలు విజయ వంతంగా ఖమ్మం జిల్లాలో అమలవు తున్నాయి అంటే దానికి కారణం ఇక్కడ చిత్తశుద్ధితో పనిచేసే అధికారులు, సిబ్బంది ఉండటమేనని అన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయం నడవాలని అన్నారు. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ విధులతో పాటు తన కుటుంబానికి సమయం కేటాయిం చాలని అన్నారు. మనకు ఒక పని ఉంటే అధికారులు ఏ విధంగా స్పందించాలని కోరుకుంటామో అదేవిధంగా మన కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మనం ప్రవర్తించాలని, ఈ అంశాన్ని ఉద్యోగులంతా గుర్తుంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ స్థాయిలో సేవలు అందించిన ఖమ్మం జిల్లా తనకు ఎప్పుడు ప్రత్యేకంగా నిలుస్తుందని, 12 నెలల కాలంలో తనకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధి చెందేందుకు, జిల్లా యంత్రాంగం ఉత్సాహంగా పని చేసేందుకు అధికారులను ఎప్పటికప్పుడు మోటివేట్ చేసేందుకు పదవి విరమణ పొందుతున్న సిబ్బందిను సన్మానిస్తూ ప్రస్థానం కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలెక్టర్ ఇంటారాక్ట్ అవుతూ వారికి ఏ అవసరాలు ఉన్నాయి, ప్రభుత్వం పరిధిలో వాటిని ఎలా నేరవేర్చాలి అనే కోణంలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని అన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సజావుగా గత 11 నెలల సమయం గడిచిందని, మహిళల అభ్యున్నతి, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యా శాఖపై కలెక్టర్ తనదైన ముద్ర వేశారని అన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమయంలో జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన ఏవీ ను ప్రదర్శించారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు వివిధ సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, తహసిల్దార్ లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, రెవెన్యూ డివిజన్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి , జిల్లా అధికారులు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయండి

**ఖమ్మం మహాసభల జయప్రదం కోసం కృషి చేస్తున్న కార్యకర్తలు అందరికీ అభినందనలు**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు వెంకటేశ్వరరావు**

**ఖమ్మం టౌన్,17 జూన్ (కెరటం న్యూస్):** జూన్ 21,22 తేదీల్లో ఖమ్మంలోని (కామ్రేడ్ నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్) కామ్రేడ్ ఎర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఏ హాల్) లో జరగనున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.మంగళవారం రాత్రి ఖమ్మం డిపో వద్ద డిపో కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం వెంకటయ్య,గుగ్గిళ్ళ రోశయ్య ల ఆధ్వర్యంలో మహాసభల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించి గోడలపై ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ఖమ్మంలో జరుగుతున్న ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలలో ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరుగుతాయని, గత కార్యక్రమాలను సమీక్షించుకొని,భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునే మహాసభల జయప్రదం కోసం సహకరిస్తున్న ఆర్టీసీ కార్మికులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.మహాసభల జయప్రదం కోసం విశేషంగా ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికోద్యమాల చరిత్రలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ కు ప్రముఖమైన స్థానం ఉందని ఆర్టీసీలో ఐక్యత,పోరాటం నినాదంతో ఆవిర్భవించి ఆర్టీసీలో జరిగిన అన్ని ఐక్య పోరాటాల్లో సాధించిన విజయాల్లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రముఖ పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఐక్యపోరాటాల సంఘం గా ఆర్టీసీ కార్మికులందరి అభిమానాన్ని చూరగొన్న ఫెడరేషన్ నాలుగవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరగటం సంతోషకరమన్నారు. మహాసభల జయప్రదం కోసం సహకరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక సోదరులు అందరికీ మాధవరావూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, రీజియన్ ఉపాధ్యక్షులు వి.సురేష్,డిపో కమిటీ ఉపాధ్యక్షులు బుగ్గవీటి లింగమూర్తి, సహాయ కార్యదర్శి వి.సురేష్, ఎస్.నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

